జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

ఆదివారం | 2-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 744 పేజీలు: 4 వెల : రూ.7






# భోగాపురం ఎయిర్‌పోర్టు..
# జాతికి అంకితం

✳ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ ✳ రూ.18వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ✳ థింసా నృత్యంతో ప్రధానికి స్వాగతం ✳ జనసంద్రంగా... భోగాపురం ✳ ఉత్తరాంధ్ర నుంచి తరలివచ్చిన ప్రజలు ✳ కిటకిటలాడిన సభా ప్రాంగణం ✳ విమానాశ్రయం వద్ద సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడిన ప్రజలు

శ్రీకాకుళం/భోగాపురం, ఆగస్టు 1 (వార్త): భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టును ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఉత్తరాంధ్రతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. సుమారు మూడు లక్షల మంది రావడంతో అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టు జనసంద్రంగా మారింది. దాదాపు 2,500కు పైగా బస్సులు, ఇతర వాహనాల్లో తరలివచ్చారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రులు నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, పార్థసారథి, వంగలపూడి అనిత, గుండు సుధారాణితో పాటు పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు, ఎంపీలు భోగాపురం చేరుకుని ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీకి గవర్నర్ జస్టిస్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులు ఆహ్వానం పలికారు. థింసా నృత్యంతో మహిళలు.. మోదీకి స్వాగతం పలికారు. అనంతరం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని ప్రారంభించారు. ఆ తర్వాత విమానాశ్రయాన్ని కలియదిరిగారు. జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు.. విమానాశ్రయం నిర్మాణంపై వివరించారు. విమానాశ్రయ నమూనాను ప్రధాని సీఎంతో కలిసి తిలకించారు. ప్రధాని మోదీకి బొబ్బిలి వీణను సీఎం చంద్రబాబు బహూకరించారు. అలాగే పొందూరు ఖాదీ కండువాతో సీఎం చంద్రబాబు సత్కరించారు. అనంతరం సభా వేదికపై నుంచే రూ.18వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు వర్చువల్‌లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. విశాఖపట్నం తర్లువాడలో ఏఎస్ఐపీ టెక్నాలజీస్ సెమీకండక్టర్ ప్యాకేజింగ్ - టెస్టింగ్ యూనిట్‌ను శంకుస్థాపన చేశారు. కర్నూలులోని విండ్, సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను, అనంతపురంలో 2500 మెగావాట్లు, కర్నూలులో 1000 మెగావాట్లు సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ పథకాలను ప్రారంభించారు. కర్నూలు-Xఎ రిన్యూవబుల్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టు, పెంచలకోన-యరపాడు మధ్యనున్న బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నాలుగు లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే, ఖమ్మం-దేవరపల్లి ప్యాకేజీ, తాడిపత్రి నాలుగు లేన్ల బైపాస్ రహదారులను ప్రారంభించారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే.. భోగాపురం ఎయిర్ పోర్టు: ప్రధాని నరేంద్ర మోదీ**

ఏపీ అభివృద్ధిలో ఇవాళ కీలకమైన రోజు.. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్‌కు ఇదొక శుభ దినం అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని జాతికి అంకితం చేశారు. రూ.18వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని మాట్లాడారు. అందరికీ నమస్కారం అంటూ తెలుగులో ప్రసంగం ప్రారంభించిన మోదీ.. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు తెలిపారు. పవిత్రమైన ఉత్తరాంధ్రకు వచ్చే అదృష్టం దక్కిందని మోదీ అన్నారు. రూ.18వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం.."రూ.18వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాం. ఈ ప్రాజెక్టులు ఏపీని శరవేగంగా, అభివృద్ధి దిశగా తీసుకెళ్తాయి. గిరిజన సంప్రదాయ నృత్యం థింసాను చూసి మధురానుభూతికి లోనయ్యా. అభివృద్ధిలో రికార్డులతో పాటు థింసా నృత్యం కూడా రికార్డు సృష్టించింది. ఒకేసారి 13వేల మంది గిరిజన మహిళల నృత్యం నిజంగా అద్భుతం. చంద్రబాబు విజన్‌కు హృదయపూర్వక అభినందనలు. భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వేగా, ఆంధ్రా యువత ఉజ్వల భవిష్యత్తుకు కొత్త లాంచ్‌పాడ్‌లా పనిచేస్తుంది. గతంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒక్క కుటుంబం పేర్లే ఉండేవి. అయోధ్యలో ఎయిర్‌పోర్టుకు వాల్మీకి పేరు, పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరు పెట్టాం. భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం. 2014కు ముందు మన దేశంలో 74 విమానాశ్రయాలే ఉండేవి. మేం వచ్చాక 12 ఏళ్లలో 166 విమానాశ్రయాలు వచ్చాయి. సామాన్యులకు కూడా విమాన ప్రయాణాన్ని చేరువ చేశాం. విమానం ఎక్కాలన్న పేద, మధ్యతరగతి కలలు సాకారం చేశాం. తమ ప్రాంతం నుంచే విమానం ఎక్కేలా కొత్త అనుభూతి తీసుకొస్తున్నాం. ఉడాన్ ద్వారా దేశ విమానయానరంగంలో పెనుమార్పులు వచ్చాయి. డబుల్ ఇంజిన్ సర్కార్.. డబుల్ స్పీడ్‌తో ఏపీ అభివృద్ధి.. దేశంలో బ్లూ ఎకానమీ అభివృద్ధి చేస్తున్నాం. విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు పాత పోర్టులు అభివృద్ధి చేస్తున్నాం. మూలపేట, రామాయపట్నంలో కొత్త పోర్టులు నిర్మిస్తున్నాం. పోర్టుల అభివృద్ధితో పాటు హైవే ఎక్స్‌ప్రెస్‌లు సరికొత్త వేగాన్ని అందిస్తున్నాయి. ఏపీలో రూ.లక్ష కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. ఈ రాష్ట్ర ప్రజలు ఎప్పుడూ భవిష్యత్తు వైపు చూస్తారు. సాఫ్ట్‌వేర్, ఐటీ సెక్టార్‌లో తెలుగువాళ్లకు మంచి పేరుంది. దేశ, విదేశాల్లో తెలుగువాళ్లు తమ సత్తా చాటుతున్నారు. ప్రతిభావంతులైన యువత సామర్థ్యం దేశానికి ఉపయోగపడాలి. చంద్రబాబు సారథ్యంలో మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఏపీ మారుతోంది. ప్రపంచంలో అనేక ప్రముఖ కంపెనీల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయి. ఏపీలో గ్రోత్ ఎకో సిస్టం నిర్మిస్తున్నాం. సెమీకండక్టర్, డేటా సెంటర్ రంగాల్లో వేగంగా పనులు జరుగుతున్నాయి. కేంద్రం.. నక్కపల్లిలో భారీ ఫార్మా కంపెనీ నిర్మిస్తోంది. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే డబుల్ స్పీడ్‌తో ఏపీ అభివృద్ధి" అని మోదీ తెలిపారు.



**ఉత్తరాంధ్ర అభివృద్ధికి సింహద్వారం: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

ఒకప్పుడు అవకాశాల కోసం ప్రపంచం వైపు ఉత్తరాంధ్ర చూసేదని.. ఇప్పుడు ప్రపంచం మనవైపు చూసేలా భోగాపురం విమానాశ్రయం చేసిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఏడాదికోమారు, పుష్కరానికి ఒకసారి జరిగే వేడుక కాదు ఇది అని.. యుగానికి ఒకసారి జరిగే పండగ అని అన్నారు. అవకాశాల నిధి.. భోగాపురం విమానాశ్రయం.. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగడం ఆనందంగా ఉందని అన్నారు. ఏవియేషన్ హబ్‌గా ఉత్తరాంధ్ర మారిన నేపథ్యంలో మెంటినెన్స్ వ్యవస్థతో సహా.. అన్ని ఇక్కడ అందుబాటులో ఉండటంతో ప్రపంచం నలుమూలల నుండి విమానాలు ఇక్కడకు వచ్చి చేరుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సింహద్వారం భోగాపురం అని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని రైల్వే జోన్, విమానాశ్రయం, స్టీల్ ప్లాంట్ లను అభివృద్ధి చేసిన ఘనత ఎన్డీయే సర్కారుకు దక్కుతుందని స్పష్టం చేశారు. తాను కేంద్ర మంత్రి గా బాధ్యత తీసుకున్న తరువాత ప్రధాని నరేంద్ర మోదీ సారధ్యంలో 16కి పైగా విమానాశ్రయాలను ప్రారంభోత్సవం చేసుకున్నామని.. వాటికన్నా ఎక్కువ తృప్తి భోగాపురం విమానాశ్రయం ఇచ్చిందని, 2 లక్షలకు పైగా స్థానిక ప్రజానీకంతో ఘనంగా ఈ కార్యక్రమం జరగడం ఆనందంగా ఉందని అన్నారు.




# సూర్యతేజలో..
# భద్రత ఎంత?

✳ సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉందా.. లేదా ? ✳ విద్యార్థినిపై వేధింపుల ఘటనతో తల్లిదండ్రుల్లో ఆందోళన ✳ కళాశాల యాజమాన్యం పర్యవేక్షణ పెంచాలని వినతి ✳ స్త్రీ శక్తి బృందాలు చురుగ్గా వ్యవహరించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ ✳ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంపై వెల్లువెత్తుతున్న విమర్శలు ✳ చోద్యం చూస్తున్న విద్యాశాఖ

**పలాస, ఆగస్టు 1 (వార్త):** సూర్యతేజ కళాశాలలో ఇటీవల విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసు నమోదు కావడం నేపథ్యంలో విద్యార్థుల భద్రతపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళాశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పర్యవేక్షణ, భద్రతా చర్యలు సమర్థవంతంగా అమలయ్యాయా అనే అంశంపై తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో సీసీ కెమెరాలు సమర్థవంతంగా పనిచేసి ఉంటే ఇటువంటి ఘటనలను ముందుగానే గుర్తించి నివారించే అవకాశం ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో విద్యాసంస్థల యాజమాన్యాలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నారు. మహిళా విద్యార్థుల రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి బృందాల పర్యవేక్షణ మరింత క్షేత్రస్థాయిలో ఉండాలని, కళాశాలలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. కేవలం తనిఖీలు నిర్వహించడం లేదా ఫొటోలు దిగడం కాకుండా, విద్యార్థుల సమస్యలను తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఘటనపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని విద్యాసంస్థల్లో భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## దానయ్య కుటుంబానికి అండగా దువ్వాడ

### -బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం



**పలాస, ఆగస్టు 1(వార్త):** ఇటీవల పలాసలో జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో మృతి చెందిన దుబ్బ దానయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దువ్వాడ మాధురి శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డా. దువ్వాడ జీవితేశ్వరరావు, సాసుమాను లోకేష్, బద్రి సీతమ్మ, పప్పల రమేష్, పి. చెల్లయ్య, కొత్తకోట శ్రీనివాసరావు, పేడాడ రమేష్, తాడి చంద్రరావు, తమిరి బలరాం, శైలాడ లావణ్య, కోనారి రామారావు, మురళి, కెల్లి లక్ష్మణరావు, కణితి కృష్ణమూర్తి, కణితి తిరుపతిరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## మొగలి కొత్తూరు, చీకటి సోంపేటలో

## రీ సర్వేకు శ్రీకారం



**సోంపేట, ఆగస్టు 1(వార్త):** మొగలి కొత్తూరు చీకటి సోంపేట భూముల రి సర్వేకు రెవెన్యూ అధికారులు శ్రీకారం చుట్టారు. తహసిల్దార్ బి.అప్పలస్వామి ఆధ్వర్యంలో ఈ మేరకు ఆయా రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. రైతులు, స్థానిక రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. డిప్యూటీ తాసిల్దార్ ఉమామహేశ్వరరావు, మండల సర్వేయర్ తిరుపతిరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నిఖిల్, విఆర్వోలు రైతులకు రీసెర్వేపై అవగాహన కల్పించారు. రిసర్వే వలన రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇటువంటి ఎంతో ప్రాధాన్యత గల కార్యక్రమాన్ని రైతులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో అధికారులు, సిబ్బంది ర్యాలీలు నిర్వహించి ప్రజలకు దీనిపై చైతన్యపరిచారు.

## 19లోగా వడగళ్ల వాన బాధిత

## రైతుల సమస్యకు పరిష్కారం

**సోంపేట, ఆగస్టు 1(వార్త):** వడగళ్ల వానతో తీవ్రంగా పంటలు నష్టపోయిన జింకిభద్ర, బెంకిలి, పలాసపురం బాధిత రైతులకు ఈనెల 19 లోగా ప్రభుత్వం సమస్య పరిష్కారం చేస్తుందని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు శనివారం తనకు రాతపూర్వకంగా ఎండార్స్మెంట్ ఇచ్చినట్టు ఎంజే పూలే రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు బీన ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. టమాటో, కట్టేజనుము పంటలు వందల ఎకరాల్లో నాశనం కావడంతో ఢిల్లీరావు రెండు పర్యాయాలు కలెక్టర్ గ్రీవెన్స్ లో ఫిర్యాదులు చేశారు. రైతులు సమస్య పై ఎందాకైనా పోరాటానికి సిద్ధమని ఆయన తెలిపారు.

## నేడు బైరిసారంగపురంలో

## వైఎస్సార్ సీపీ ప్రత్యేక సమావేశం

**మందస, ఆగస్టు 1(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మందస మండల సమావేశం ఈనెల రెండున మందసా మండలంలోని బైరిసారంగపురంలో నిర్వహించనున్నట్టు పార్టీ నాయకులు తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అక్రమ అరెస్ట్ కు నిరశిస్తూ ఆగస్టు 2న ఉదయం 10 గంటలకు మందస క్లస్టర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆ క్లస్టర్ పరిధిలో మాజీ సర్పంచ్ లు, ఎమ్పీటిసిలు, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలతో సమావేశం జరుగు తుందన్నారు. మందస మండలంలో గల ఎంపీపి, జడ్పీటీసీ, పార్టీ క్లస్టర్ ఇన్చార్జ్ లు, సీనియర్ నాయకులు, పార్టీ అనుబంద విభాగంలలో వివిద హోదాలో ఉన్న నాయకులు తప్పని సరిగా హజరు కావాలని కోరారు.,

## రిటైర్డ్ హెచ్ఎం లక్ష్మీనారాయణ ఉదారత

**మందస, ఆగస్టు 1(వార్త):** రిటైర్డ్ ఎల్.ఎఫ్.ఎల్. హెడ్ మాస్టర్ నగిరి లక్ష్మీనారాయణ ఉదారత చూపారు. మందస మండలంలోని సొండిపూడి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ తన 87వ జన్మదినం సందర్భంగా సొండిపూడి జెడ్.పి.హెచ్.ఎస్. విద్యార్థులకు స్టీల్ గ్లాసులు, చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది ఆయనను పుష్పగుచ్చంతో అభినందించారు. అనంతరం లక్ష్మీనారాయణ మాస్టారు మాట్లాడుతూ ఈ ఏడాది పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి ఇస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నగరి కరుణాకర్, అరుణకుమార్, చంద్రశేఖర్, నారాయణరావు, వెంకటరమణ, చంటిబాబు, విజయ్, జోత్స్న, జయరాం, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఇంటికీ అభివృద్ధి..

# ప్రతి కుటుంబానికి సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

### -బొడ్డపాడులో ఇంటింటా ప్రచారం



**పలాస, ఆగస్టు 1(వార్త):** "ప్రతి ఇంటికీ అభివృద్ధి--ప్రతి కుటుంబానికి సంక్షేమం కూటమి ప్రభుత్వం లక్ష్యమని పలాస మండల తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు (కేడీఆర్) పేర్కొన్నారు.

బొడ్డపాడు గ్రామంలో ఎన్డీఏ ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేసే లక్ష్యంతో డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని పలాస తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు (కేడీఆర్) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించి ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి ఇంటికి అభివృద్ధి ఫలాలు చేరేలా, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు విస్తరించడం, అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరవేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్-4 ఇన్చార్జి మురుపింటి కుమార్‌రాజ్, పలాస పీఏసీఎస్ డైరెక్టర్ బొడ్డు దుష్యంత్, జెడ్పీహెచ్ స్కూల్ చైర్మన్ గర్తం తులసిరావు, మద్దిల తిరుపతిరావు, గుజ్జు దుష్యంత్, బొడ్డు వల్లభరావు, సుబుద్ది మురళీరావు, వంకల కృష్ణారావు, వంకల అప్పారావు, తామాడ ధర్మారావు, బొడ్డు పాపారావు, నాయుడు మోహన్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ఎన్డీఏ కూటమి నాయకులు, కుటుంబ సభ్యులు బొడ్డు మోహన్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కిక్కర ఢిల్లీరావు మాట్లాడుతూ, "ప్రతి ఇంటికీ అభివృద్ధి – ప్రతి కుటుంబానికి సంక్షేమం" లక్ష్యంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

# పాకెట్ మనీతో సేవా మార్గం

### -11 ఏళ్లుగా నిరంతర నారాయణసేవ

### - 'అందరిని సేవించు--అందరిని ప్రేమించు' సందేశాన్ని ఆచరణలో చూపుతున్న విద్యార్థులు

### - షిర్డీసాయి మందిరం వద్ద నారాయణులకు అన్నప్రసాదం, విభూతి, స్వామివారి చిత్రపటం పంపిణీ



**పలాస, ఆగస్టు 1(వార్త):** భగవాన్ శ్రీ సత్యసాయిబాబా బోధించిన "అందరిని సేవించు-అందరిని ప్రేమించు" అనే దివ్య సందేశాన్ని ఆచరణలో నిలబెడుతూ, శ్రీ సత్యసాయి విద్యావిహార్, రామకృష్ణాపురం విద్యార్థులు మరోసారి ఆదర్శంగా నిలిచారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా సూచించిన 'సీలింగ్ ఆన్ డిజైర్స్'బికోడ్ భావనకు అనుగుణంగా, రోజువారీ ఖర్చులను తగ్గించి పాకెట్ మనీలో కొంత మొత్తాన్ని పొదుపు చేస్తూ, ఆ సొమ్ముతో గత 11 సంవత్సరాలుగా ప్రతి నెల మొదటి తేదీన నిరంతరంగా నారాయణసేవ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం షిర్డీసాయి మందిరం సమీపంలోని నారాయణులకు అన్నప్రసాదంతో పాటు స్వామివారి విభూతి, శ్రీ సత్యసాయిబాబా చిత్రపటాన్ని అందజేశారు.

సేవాభావంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వార్డెన్ చంద్రశేఖర్, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మానవసేవే మాధవసేవ అనే సందేశాన్ని చాటిచెప్పారు. ఈ సేవా కార్యక్రమంలో విద్యావిహార్ వార్డెన్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## 'ఒకే స్కార్ఫ్.. ఒకే భావం.. ఒకే దేశం' నినాదంతో

# స్కౌట్స్ ప్రత్యేక కార్యక్రమం

### -ప్రపంచ స్కార్ఫ్ దినోత్సవం సందర్భంగా నగరంపల్లి హైస్కూల్‌లో ఐక్యతా ర్యాలీ

### -మానవహారంగా విద్యార్థులు

**పలాస, ఆగస్టు 1(వార్త):** ప్రపంచ స్కార్ఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వజ్రపుకొత్తూరు మండలంలోని నగరంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. "ఒకే స్కార్ఫ్.. ఒకే భావం.. ఒకే దేశం" అనే నినాదంతో విద్యార్థుల్లో ఐక్యత, సేవాభావం, దేశభక్తి వంటి విలువలను పెంపొందించేలా కార్యక్రమాలు చేపట్టారు.

ఈ సందర్భంగా స్కౌట్స్ లక్ష్యాలైన క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, పర్యావరణ పరిరక్షణ, సృజనాత్మకత, నైపుణ్యాల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన 'వాక్ ఇన్ యూనిటీ' ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం స్కార్ఫ్ ఆకారంలో విద్యార్థులు మానవహారంగా నిలిచి ఐక్యతకు ప్రతీకగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. హేమారావు, స్కౌట్ మాస్టర్లు కొయ్యల శ్రీనివాసరావు, నక్క గౌరునాయుడు ఆధ్వర్యం వహించగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వాసుదేవా..సీదిరికి బెయిల్ వచ్చేలా చేయవా.!

### - ప్రభుత్వ అక్రమాలపై ఉక్కుపాదం మోపు స్వామీ..

### -వాసుదేవుని సన్నిధిలో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రత్యేక పూజలు

**మందస, ఆగస్టు 1(వార్త):** వాసుదేవా.. మా మొర ఆలకించు.. సీదిరి అప్పలరాజుకు బెయిల్ వచ్చేలా చేయవా స్వామీ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు, అక్రమాలపై ఉక్కుపాదం మోపు స్వామీ అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు జరిపారు. మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై కూటమి పాలనలో జరుగుతున్న అక్రమాలను భస్మీపటం చేసి, అప్పలరాజు త్వరగా బెయిల్ పై విడుదల అవ్వాలని మందస పట్టణంలోని శ్రీవాసుదేవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు చెందిన మత్స్యకార నాయకుడు, మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు ధోరణితో కుట్రపూరితంగా అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. పలాస నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మందసలోని వాసుదేవ పెరుమాళ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు త్వరితగతిన బెయిల్ మంజూరై, క్షేమంగా ప్రజల మధ్యకు తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ 108 టెంకాయలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ దేవదేవుని ప్రార్థించారు. ప్రజలకు నిరంతరం సేవలందించిన నాయకుడిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. సత్యం, ధర్మం, న్యాయం చివరికి గెలుస్తాయని, న్యాయస్థానంపై పూర్తి విశ్వాసం ఉందని వారు తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గారికి త్వరలోనే న్యాయం జరుగుతుందని, ప్రజల ఆశీస్సులు, దైవానుగ్రహం ఆయనకు అండగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



### విద్యార్థినిపై వేధింపుల ఘటనపై

## వైసీపీ విద్యార్థి విభాగం ఆగ్రహం

### - బాధితురాలికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్

### -కళాశాల యాజమాన్యంపై క్రిమినల్‌కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి

### - నిందితుడిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణకు డిమాండ్

### - విద్యార్థినుల భద్రతలో విఫలమైన కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్



**పలాస, ఆగస్టు 1(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక పరిధిలోని సూర్యతేజ ప్రైవేట్ కళాశాలలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఘటనపై వైఎస్సార్సీపీ పలాస నియోజకవర్గ విద్యార్థి విభాగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బాధిత విద్యార్థినికి రూ.20 లక్షల పరిహారం అందజేయడంతో పాటు కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి, కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేసింది. వైఎస్సార్సీపీ పలాస నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు బమ్మిడి సంతోష్ కుమార్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థల్లోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. విద్యార్థినుల భద్రతను నిర్ధారించాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యానిదేనని, ఆ బాధ్యతను సూర్యతేజ కళాశాల యాజమాన్యం విస్మరించిందని ఆరోపించారు. ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే బాధ్యతాయుతంగా స్పందించాల్సిన యాజమాన్యం, దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం మరింత బాధాకరమన్నారు. కళాశాల ప్రతిష్ఠకే ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల భద్రతను నిర్లక్ష్యం చేయడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని విమర్శించారు. ఘటనపై వెంటనే స్పందించి నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసు అధికారులను అభినందించారు. అయితే నిందితుడిపై చర్యలతో పాటు, భద్రతా లోపాలకు బాధ్యత వహించాల్సిన కళాశాల యాజమాన్యంపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాలలో సీసీ కెమెరాలు, మహిళా సిబ్బంది, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వంటి కనీస భద్రతా ఏర్పాట్లు లేకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. బాధిత విద్యార్థినికి రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని, ఘటనను దాచిపెట్టే ప్రయత్నం చేసిన కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ చేపట్టి త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చార్జ్‌షీట్ దాఖలు చేయాలని కోరారు. విద్యార్థినుల భద్రత విషయంలో విఫలమైన సూర్యతేజ కళాశాల గుర్తింపును రాష్ట్ర విద్యాశాఖ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి పూర్తి న్యాయం జరిగే వరకు వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం పోరాటం కొనసాగుతుందని బమ్మిడి సంతోష్ కుమార్ తెలిపారు. పలాస నియోజకవర్గంలోని అన్ని కళాశాలల్లో విద్యార్థినుల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## యాదవ్ కుటుంబానికి అండగా దువ్వాడ.. అభినందనీయం

### - ప్రజా సమస్యలపై జిల్లా నాయకత్వం వెంటనే స్పందించాలి

### - బద్రి సీతమ్మ యాదవ్



**పలాస, ఆగస్టు 1(వార్త):** కష్టాల్లో ఉన్న యాదవ్ కుటుంబానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అండగా నిలిచి రూ.20 వేల ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని బద్రి సీతమ్మ యాదవ్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించి ధైర్యం చెప్పడంతో పాటు ఆర్థికంగా చేయూతనివ్వడం నాయకత్వానికి నిదర్శనమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు వెంటనే స్పందించి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా స్థాయి నాయకత్వం ప్రజా సమస్యలపై మరింత చొరవ చూపాలని, రాజకీయాలకు అతీతంగా బాధిత కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. స్థానిక రాజకీయాల్లో కక్షసాధింపు చర్యలు, తప్పుడు కేసులు నమోదు చేయడం వంటి పరిణామాలు ప్రజాస్వామ్యానికి మంచివి కావని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారానికే నాయకులు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల్లో విశ్వాసం పెంచే విధంగా పనిచేయాలని సూచించారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములై సేవాభావంతో ముందుండే నాయకత్వానికే ప్రజలు ఆదరణ చూపుతారని బద్రి సీతమ్మ యాదవ్ పేర్కొన్నారు.

## బాల గంగాధర్ తిలక్ వర్ధంతి వేడుకలు

**ఇచ్చాపురం, ఆగస్టు 1(వార్త):** ఇచ్చాపురంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి లోకమాన్య బాలగంగాధర్ తిలక్ చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించారు.బాలగంగాధర తిలక్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సెక్రెటరీ డి.ఇందిరా రెడ్డి డైరెక్టర్స్ డి. దినేష్ కుమార్ డి.పవన్ కళ్యాణ్, జి. తేజశ్రీ, బి.శృతి మేనేజర్ కే.సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శంకర్, శాంతి, శ్రీధర్, యశోద, జయలక్ష్మి, పార్వతి, స్నేహ, మీనఓ ప్రమీల, సరోజినీ, శిరీష, తేజేశ్వరి, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# బొడ్డపాడులో శరవేగంగా తారు రోడ్ల నిర్మాణం

**- ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక చొరవతో గ్రామ ప్రజల కల సాకారం**



**పలాస, ఆగస్టు 1 (వార్త):** గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ప్రజల సహకారంతో చేపట్టిన ఈ పనులను పలాస తెలుగు యువత అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు (కేడీఆర్) గ్రామ ప్రజలతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి అయ్యేలా అధికారులు, కాంట్రాక్టర్లకు బొడ్డపాడు గ్రామంలో శనివారం సూచనలు చేశారు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే గ్రామంలో రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు ప్రజల రాకపోకలకు ఎంతో సౌలభ్యం కలగనుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలాస పిఏసిఎస్ డైరెక్టర్ బొడ్డ దుష్యంత్, క్లస్టర్-4 ఇన్‌చార్జి మురుపింటి కుమార్ రాజ్, జెడ్పీహెచ్ స్కూల్ చైర్మన్ గర్తం తులసిరావు, మాజీ సర్పంచ్ తామాడ త్రిలోచనరావు, దాసరి శ్రీరాములు, బొడ్డ సింహాద్రి, పోతనపల్లి చిరంజీవి, బొడ్డ మోహన్, బుడత కాంతారావు, బత్తిని వాసు, తామాడ గంగయ్య, నౌగాపు సింహాచలం, బుడత బాలరాజు, బచ్చల శంకర్, రాజాం శ్రీనివాస్, నాయుడు మోహన్, మద్దిల ధర్మారావు, పోతనపల్లి కాంతారావు, బొడ్డ శ్రీనివాస్, గర్తం ఈశ్వరరావు, రెయ్య ఈశ్వరరావు, తామాడ ధర్మారావు, గుజ్జు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

### చారిత్రక కట్టడాలు కూల్చిన వారిపై

## కఠిన చర్యలు తీసుకోవాలి

**-గోపాలసాగరం పురాతన కట్టడాలు కూల్చివేత సరికాదు**

**-పోరాటానికి సంఘీభావం**

**- కల్నల్ రాజా సి.పి.సింగ్ దేవ్**



**మందస, ఆగస్టు 1(వార్త):** చారిత్రక కట్టడాల పరిరక్షణ కోసం మందస ప్రజలు చేస్తున్న పోరాటానికి మందస రాజవంశీయులు కల్నల్ రాజా సి.పి.సింగ్ దేవ్ తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తూ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. వివరాలిలా ఉన్నాయి. ప్రసిద్ధ గోపాలసాగరం పక్కనున్న మండపాన్ని ఇటీవల కూల్చివేయడం అత్యంత దురదృష్టకరమని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మందసకు చెందిన 800 సంవత్సరాలకు పైగా నాటి ఘనమైన వారసత్వ సంపదలో ఈ మండపం ఒక ముఖ్యమైన భాగమని, అలాంటి అద్భుతమైన చారిత్రక నిర్మాణం మన కళ్ల ముందే తుడిచిపెట్టుకుపోవడం ఎంతో బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. మన చరిత్రను, సంస్కృతిని నాశనం చేయాలనే ఉద్దేశంతో జరుగుతున్న ఇలాంటి నేరపూరిత ప్రయత్నాలను కలిసికట్టుగా అడ్డుకోవాలని మందస ప్రజలందరికీ ఆయన పిలుపునిచ్చారు. మందస హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం గత ఏడాది విశేషమైన కృషిచేసి 125 ఏళ్ల నాటి పురాతన భవనాన్ని పునరుద్ధరించి ఆదర్శంగా నిలిచిందని ఆయన గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో మందస వారసత్వ సంపద అయిన చెరువులు, దేవాలయాలు, కొండలు, ఇతర చారిత్రక కట్టడాలను రక్షించుకోవడానికి మనం భవిష్యత్తులో మరింత సమిష్టిగా కృషి చేయాల్సి ఉంటుందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణలో ఉన్న తమ పూర్వీకుల నివాసాన్ని(కోట) కూల్చివేయడంపై తాను ఇప్పటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు ఆయన తెలిపారు. మన సమాజంలోని ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ఘోరమైన చర్యలకు ఒడిగట్టిన బాధ్యులపై ప్రభుత్వం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే తరాల కోసం మందస వారసత్వాన్ని కాపాడుకుంటామని మనమందరం ప్రతిజ్ఞ చేద్దాం రండి అంటూ ఆయన భావోద్వేగ సందేశాన్ని అందించారు. దూర ప్రాంతంలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో జరుగుతున్న విధ్వంసాన్ని ప్రశ్నిస్తూ, సంఘ వ్యతిరేక చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలకు పిలుపునివ్వడం పట్ల, ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ నాయకులు మామిడి కోదండరావు, నిరంజన ప్రధానో, ప్రముఖ సంఘ సేవకులు గిన్ని తిరుపతిరెడ్డి, నాయకులు కంచి బెహరా, డాక్టర్ జీవితేజేశ్వరరావు, పూర్ణచంద్ర మహరణ, గౌరంగపండా, పురుషోత్తంబెహరా, మల్లారెడ్డి రాజు, శ్రీనివాసపాడి, జుజిస్టి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. మందస వారసత్వ పరిరక్షణకు కర్నల్ రాజా సి.పి. సింగ్ దేవ్ అందిస్తున్న మద్దతు ఒక శుభ పరిణామమని వారు ఆయనకు అభినందనలు తెలిపారు.

### భోగాపురం విమానాశ్రయం ప్రారంభంతో

## ఆమదాలవలస-శ్రీకాకుళం రహదారిపై ట్రాఫికర్



**శ్రీకాకుళం, ఆగస్టు 1(వార్త):** భోగాపురం విమానాశ్రయం ప్రభావం ఉత్తరాంధ్ర రహదారి రవాణాపై కనిపించే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వెళ్లే ప్రధాన రహదారిపై ఇప్పటికే భారీ లారీల రాకపోకలు ఎక్కువగా ఉండగా, విమానాశ్రయం ప్రారంభం తర్వాత ప్రయాణికుల వాహనాలు, ఆర్టీసీ బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు పెరగడంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశముందని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రహదారిపై పలు ప్రాంతాల్లో రద్దీ కారణంగా తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు ప్రారంభమైతే, వాటిని ఈ మార్గంలో నడపడం వల్ల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు. స్థానిక ప్రజలు, వ్యాపారులు ప్రత్యామ్నాయ మార్గాల అభివృద్ధి, రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, అవసరమైన చోట్ల బైపాస్ రహదారుల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు. విమానాశ్రయం అభివృద్ధితో పాటు రహదారి మౌలిక సదుపాయాలను కూడా బలోపేతం చేస్తేనే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు.

## ఆముదాలవలసలో వైఎస్సార్సీపీ నేతలపై అక్రమ కేసులు

**- కూటమి ప్రభుత్వంపై మహిళా నేతల విమర్శలు**

**ఆముదాలవలస, ఆగస్టు 1(వార్త):** ఆముదాలవలస నియోజకవర్గ వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ మహిళా నేతలు కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేపై తీవ్ర విమర్శలు చేశారు. జూలై 30న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సిదిరి అప్పలరాజును పరామర్శించేందుకు వచ్చిన సందర్భంగా ఉత్తరాంధ్రతో పాటు ఆముదాలవలస నియోజకవర్గం నుంచి వేలాదిమంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి స్వాగతం పలికారని వారు తెలిపారు. ఆ ప్రజాదరణను చూసి భయపడిన కూటమి ప్రభుత్వం, టీడీపీ నేతల ఒత్తిడితో ఆముదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌తో పాటు 21 మందిపై అక్రమ కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. ఒక మహిళా ఉద్యోగినిని అడ్డం పెట్టుకుని రాజకీయ ప్రయోజనాల కోసం కేసులు నమోదు చేయించారని, చట్టం, న్యాయం గురించి మాట్లాడే నైతిక హక్కు స్థానిక ఎమ్మెల్యేకు లేదని విమర్శించారు. బూర్జ ఎస్సై ప్రవల్లికకు ఘటన జరిగిన రోజున ఎలాంటి అవమానం జరగలేదని, అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ఉపయోగించిన వ్యాఖ్యలే ఆమె ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయని వారు ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టేందుకు అక్రమ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ వైఎస్సార్సీపీ వెనక్కి తగ్గబోదని, ప్రజల మద్దతుతో మళ్లీ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఆముదాలవలసలో చింతాడ రవికుమార్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని మహిళా నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి అజంత కుమారి, నియోజకవర్గ మహిళా విభాగ అధ్యక్షురాలు చిగురుపల్లి ధనలక్ష్మి, మున్సిపాలిటీ మహిళా విభాగ అధ్యక్షురాలు లక్ష్మీ ప్రసన్న, పొందూరు మండల మహిళా విభాగ అధ్యక్షురాలు కూన రమణమ్మ, బూర్జ మండల మహిళా విభాగ అధ్యక్షురాలు గేదెల శ్రీదేవి, నియోజకవర్గ అంగన్వాడీ విభాగ అధ్యక్షురాలు పొన్నాడ మాధురి తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు.



## వైసీపీ నాయకులు చురుగ్గా పనిచేయాలి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 1(వార్త):** వైస్సార్సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయ కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, పార్టీ సమాచారం కార్యకర్తలకు, ప్రజలకు సకాలంలో తెలియజేసేలా చురుగ్గా పని చేయాలనీ కోరారు. ప్రతీ విభాగం సభ్యులను సమాచారం క్లస్టర్ విధానం ద్వారా ప్రతీ గ్రామం వార్డు లోని కార్యకర్తలు పార్టీ సానుభూతిపరులకు అనుసంధానం చేసే విదంగా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శి, నర్తు నరేంద్ర యాదవ్, ఎంపిపి పైల దేవదాస్ రెడ్డి,కడియాల ప్రకాష్, ప్రేమ్ కుమార్, పురుషోత్తం రెడ్డి, సాలిన ఢిల్లీ, గుజ్జు తారకేసు, బాబురావు, కృష్ణ రెడ్డి, ఇప్పిలి కృష్ణ రావు, నాగుభూషణం రెడ్డి, చల్ల దేవరాజు, పొడుగు కామేష్, పలికిల జయరాం, అభి యాదవ్, ఋషి, బడకల సతీష్, తెల్లి వైకుంఠ రావు, పాతిన గిరి, తదితరులు పాల్గొన్నారు.

## రత్తకన్న పాఠశాల ఎంఈవో 2 తనిఖీ



**ఇచ్ఛాపురం, ఆగస్టు 1(వార్త):** మండల విద్యాశాఖాధికారి 2 సున్నా ముద్ది విశ్వనాథం రత్తకన్న ఉన్నత పాఠశాలను పర్యవేక్షించారు. పర్యవేక్షణలో 6వ తరగతి విద్యార్థులతో ముచ్చటించి విద్యాసామర్థ్యాలు పరిశీలించి, రోడ్డుబద్రతా విద్యా అంశముపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి విద్యార్థుల్ని చైతన్య పరచారు. సంసిద్ధత కార్యక్రమం అభ్యసన విధానాన్ని పరిశీలించారు.పదవ తరగతి విద్యార్థులకు ఉత్తమ ఫలితాల సాధనకై, శత శాతం ఉత్తీర్ణత సాధనకు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు అందించారు. మధ్యాహ్న భోజనం నిర్వహణను పరిశీలించి మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవరాజు పాఠశాల సిబ్బంది. సి అర్ ఎం టి దేవరాజు పాల్గొన్నారు.


## మందసలో రౌండ్ టేబుల్ సమావేశపు కరపత్రం ఆవిష్కరణ



**మందస, ఆగస్టు 1(వార్త):** చారిత్రక కట్టడాలను కూల్చి వేతకు నిరసనగా ప్రజా సంఘాలతో 2న ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని కరపత్రాలను మందసలో ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ సభ్యులు, శివాలయం కమిటీ సభ్యులు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ మామిడి కోదండరావు మాట్లాడుతూ చారిత్రక కట్టడాల విధ్వంసానికి వ్యతిరేకంగా కొత్త వీధి, కాలనీ పొందర వీధి, గౌడ వీధి పురవీధులలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. మండప ప్రాంతంలో శివాలయం ఉందని, ఆ శివాలయానికి వెళ్లే రహదారి కూడా ఇదే కావడం చేత ఆ మండప ప్రాంతాలను ధ్వంసం చేయడం పట్ల ప్రజలు తీవ్రమైన ఆందోళన వ్యక్తపరుస్తున్నారన్నారు. కార్తీక మాసం, శివరాత్రి ఉత్సవాల సందర్భంగా సుమారుగా 15 గ్రామాల నుంచి ప్రజలు ఈ ప్రదేశాన్ని సందర్శిస్తారని, ఈ మార్గాన్ని ఓపెన్ జిమ్ నిర్మించడం వలన భక్తుల రద్దీ ఏర్పడిన తొక్కిసలాట వంటి ప్రమాదకర పరిస్థితులను భక్తులు ఎదుర్కోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదకర ఘటనలకు ఓపెన్ జిమ్ కారణం అవుతుందని, వెంటనే జిమ్ ప్రతిపాదనను విరమించుకొని ఆ ప్రాంతాన్ని మందస చారిత్రక వారసత్వ సంపదగా గుర్తించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ధ్వంసం చేసిన మండపాన్ని కాంట్రాక్టర్ వెంటనే నిర్మాణం చేసి వారిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కురేష్, గయా సంతు, గుడియా రవీంద్ర సాహూ, బంగారు పద్మనాభం, పూర్ణ చందు మహరణ, తలగాన వెంకటరావు, నిరంజన్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడ పద్మనాభంకు నివాళులు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 1 (వార్త):** కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతి పట్ల పట్టణ తెలగ సంక్షేమ సంఘం నాయకులు నివాళులర్పించారు. స్థానిక పెద్దఆకుల వీధిలో కుల సంఘం కార్యాలయం లో చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో కట్టా సూర్యప్రకాషరావు కేతం పూర్ణ శంకర రావు,దొండపాటి ధర్మారావు, పుట్టా నరసింగ రావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

-విధ్వంసం చేసిన ప్రాచీన మండపాన్ని పునర్నిర్మాణం చేయాలి

-ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ డిమాండ్

- నేడు మందసలో ప్రత్యేక సమావేశం





**మందస, ఆగస్టు 1(వార్త):** మందస పట్టణంలోని చారిత్రక గోపాలసాగరం ఆధునీకరణ పేరుతో ఇటీవల ధ్వంసం చేసిన ప్రాచీన మండపాన్ని తిరిగి పునర్మాణం చేయాలని ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. మందస ఎంపీటీసీ కంచి బెహరా అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో ప్రముఖ సంఘసేవకులు గిన్ని తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి అధికారిక అనుమతులు లేనప్పటికీ, కాంట్రాక్టర్ తన ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి ఈ పురాతన నిర్మాణాన్ని కూల్చివేశారన్నారు. స్థానిక ప్రజలు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తపరిచినప్పటికీ, కాంట్రాక్టర్ మొండి వైఖరితోనే మండపాన్ని ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పొందర దుదిష్టి మాట్లాడుతూ గుప్త నిధుల కోసం ఈ ప్రాచీన కట్టడాలను ధ్వంసం చేసారన్న ప్రచారముందని ఆరోపించారు. ఇలాంటి అనేక అనుమానాల నేపథ్యంలో కూల్చివేతపై జిల్లా కలెక్టర్ కు, స్థానిక అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని అన్నారు. ధ్వంసమైన ఆ ప్రాచీన స్థలంలో తక్షణమే తిరిగి మండపాన్ని పునర్నిర్మించాలని, ఆ ప్రాంతాన్ని మందస ప్రాచీన వారసత్వ సంపదగా గుర్తించి పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ.. ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ మామిడి కోదండరావు మాట్లాడారు. మన సంస్కృతిని, చరిత్రను కాపాడుకునేందుకై సాగుతున్న ఈ పోరాటానికి మీ వంతు సంఘీభావం తెలపాలని, పూర్తి మద్దతు ప్రకటించాలని మల్లారెడ్డి రాజు ప్రజాస్వామ్యవాదులకు, చరిత్ర ప్రేమికులకు విజ్ఞప్తి చేశారు. పొందర నిరంజన బెహరా, పూర్ణచందు మహరణ మాట్లాడుతూ ఈ నెల 2(ఆదివారం) ఉదయం 10 గంటలకు మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కనున్న చారిత్రిక ప్రదేశంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రజాస్వామ్యవాదులు, ప్రగతికాముకులు, చరిత్ర ప్రేమికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గయా సంతు, కురేషు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య

- లింగన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి




**జలుమూరు, ఆగస్టు 1 (వార్త):** శ్రీముఖలింగం గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన కంచరాన లింగన్న కుటుంబ సభ్యులను యువ నాయకుడు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గ్రామానికి చేరుకున్న ఆయన, లింగన్న చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా కుటుంబానికి ధైర్యం చెప్పి, ఈ విషాద సమయంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, జిల్లా ఉపాధ్యక్షులు బగ్గు రామకృష్ణ, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు దామ మన్మధరావు, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ధర్మాన జగన్ మోహన్, మండల యూత్ అధ్యక్షుడు జుత్తు నేతాజీ, మండల ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు పొన్నాన ముసలినాయుడు, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు పైడి విటల్‌రావు, ఎంపీటీసీ కరుకోల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు బసవ వెంకటరమణ, మండల కార్యదర్శి సీపాన మోహన్, సీపాన వేణు, గుంట సింహాచలం, మూకాళ్ల ధనుంజయ్, తౌడు పండా తదితరులు పాల్గొన్నారు.

## రావిపాడు పాఠశాలనుద సందర్శించిన ఎంఈవో

-రాగి జావ నాణ్యతను పరిశీలించి

విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధన

-పరిశుభ్రత, నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన



**జలుమూరు, ఆగస్టు 1 (వార్త):** రావిపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాలను శనివారం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) ప్రసాదరావు సందర్శించి విద్యా, పోషకాహార కార్యక్రమాల అమలును పరిశీలించారు. పాఠశాలలో పర్యటించిన ఆయన ముందుగా విద్యార్థులకు అందిస్తున్న రాగి జావా నాణ్యతను పరిశీలించారు. పోషకాహారాన్ని పరిశుభ్రంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసి విద్యార్థులకు అందించాలని వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. అనంతరం తరగతి గదులను సందర్శించిన ఎంఈవో బ్లాక్‌బోర్డుపై స్వయంగా రాస్తూ విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నిస్తూ వారి అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు కూడా ఆసక్తిగా పాఠాలను విని సమాధానాలు చెప్పడంతో ఆయన అభినందించారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పోషకాహార కార్యక్రమాల అమలుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారులు, వృద్ధులకు అల్పాహారం పంపిణీ



**శ్రీకాకుళం, ఆగస్టు 1(వార్త)::** శ్రీకాకుళంకు చెందిన రొక్కం భాస్కర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన సతీమణి భవాని, కుమారెత, కుమారుడు సాయి షర్మిల, పునీత్ సాయి హర్ష సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతా కల్యాణ అనురాగం నిలయంలోని చిన్నారులకు, సి.వి. నాగజ్యోతి ఆనంద నిలయంలోని వృద్ధులకు శనివారం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పి. జగన్ మోహన్ రావు, కనుగుల దుర్గా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు రొక్కం భాస్కర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భాస్కర్ కుటుంబ సభ్యులు సకల అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, కీర్తి ప్రతిష్ఠలతో సుఖసంతోషాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థించారు.



## మూడేళ్ల తర్వాత పునఃప్రారంభమైన ప్రభుత్వ హోమియో ఆసుపత్రి

- గ్రామస్తుల నిరీక్షణకు తెర.. వైద్య సేవలు మళ్లీ అందుబాటులోకి

- ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తల కృషితో ఫలించిన ప్రయత్నాలు




**జలుమూరు, ఆగస్టు 1 (వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలోని ప్రభుత్వ హోమియో ఆసుపత్రి మూడేళ్ల విరామం అనంతరం శనివారం పునఃప్రారంభమైంది. సుమారు 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా మూతపడగా, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది రోగులు హోమియో వైద్య సేవలకు దూరమయ్యారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, 2024 శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థి నాయుడుగారి రాజశేఖర్ జూలై 3న జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేశారు. అనంతరం జిల్లా హోమియో అధికారిని కలిసి ఆసుపత్రిని పరిశీలించి, మరమ్మతులు చేపట్టి తిరిగి ప్రారంభించాలని కోరారు. దీనిపై స్పందించిన జిల్లా హోమియో అధికారులు ఆసుపత్రిని సందర్శించి భవన పరిస్థితి, ఫర్నిచర్, అవుట్‌పేషెంట్ గదులను పరిశీలించారు. ఆసుపత్రికి అవసరమైన మరమ్మతులు, పెయింటింగ్ పూర్తి చేసి, వైద్యుడు, సిబ్బందిని నియమించి సేవలు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హోమియో శాఖ ద్వారా విజయవాడ ఆయుష్ కమిషనర్‌కు నివేదిక పంపగా, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఒక వైద్యాధికారి, ఒక కాంపౌండర్ పోస్టులను మంజూరు చేసింది. అనంతరం ఆసుపత్రిని అధికారికంగా పునఃప్రారంభించి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సమస్య పరిష్కారంలో రిటైర్డ్ కమ్యూనికేషన్స్ సీఐ, సామాజిక కార్యకర్త సూరా రామసూర్యారావు కూడా పలుమార్లు స్పందించి ఆసుపత్రి పునరుద్ధరణకు తన వంతు సహకారం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు. మూడేళ్లుగా ఆసుపత్రి తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతుందా అని ఎదురుచూస్తున్న తమకు ఇది సంతోషకరమైన పరిణామమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. హోమియో వైద్య సేవలు పునరుద్ధరించడంతో పరిసర ప్రాంతాల ప్రజలకు మళ్లీ సులభంగా చికిత్స అందనున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కర్ణ వీరుడు, బాలకృష్ణ పట్నాయక్, నానీ మాస్టర్, వార్డు సభ్యుడు పైడి రమణ, ఇంజనీర్ సింహాచలం, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయంపై విద్యార్థులకు అవగాహన

- ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సదస్సు

- వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు



**నరసన్నపేట, ఆగస్టు 1 (వార్త):** 'భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి తలమానికం' అనే అంశంపై నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విమానాశ్రయ నిర్మాణంతో ప్రాంతీయ అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పెద్దాడ లత మాట్లాడుతూ, దేశ అభివృద్ధిలో అవస్థాపన సౌకర్యాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్ మాట్లాడుతూ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడం ద్వారా ఉత్తరాంధ్రలో పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటకం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని వివరించారు. విద్యార్థులు ప్రాంతీయ అభివృద్ధిలో ఇటువంటి ప్రాజెక్టుల ప్రాధాన్యతను అవగాహన చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అధ్యాపకులు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధిపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## నవధాన్యాల వినియోగం.. భూసారానికి మేలు

- ఖరీఫ్‌లో రైతులు ఈ విధానాన్ని పాటించాలని వ్యవసాయ శాఖ సూచన

- పోషక విలువలు పెరిగితే దిగుబడులు అధికమవుతాయని అధికారులు వెల్లడి

**నరసన్నపేట, ఆగస్టు 1 (వార్త):** ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు నవధాన్యాలను వినియోగించడం ద్వారా భూమిలో పోషక విలువలు పెరిగి అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ ఏడీ వెంకట మధు, వ్యవసాయ అధికారి (ఏవో) సూర్యకుమారి తెలిపారు. శనివారం యారబాడులో నిర్వహించిన రైతుల సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ, భూసారాన్ని పరిరక్షించడంతో పాటు సేంద్రియ పోషకాల పెంపునకు నవధాన్యాల సాగు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ విధానాన్ని అనుసరించడం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడి, వరి పంటకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని చెప్పారు. రైతులు సంప్రదాయ పద్ధతులతో పాటు శాస్త్రీయ సాగు విధానాలను అవలంబించాలని, వ్యవసాయ శాఖ సూచనలను పాటించడం ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయ భూముల సారాన్ని కాపాడేందుకు ప్రతి రైతు నవధాన్యాల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, భూసార పరిరక్షణ చర్యలను విస్తృతంగా అమలు చేయడం ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## ధర్మానను ఆత్మీయంగా కలిసిన బల్ల

- ఉత్తరాంధ్ర సమస్యలపై ధర్మాన పోరాటానికి మద్దతు

- పలాసలో వైఎస్సార్‌సీపీ నాయకుల మర్యాదపూర్వక భేటీ



**పలాస, ఆగస్టు 1(వార్త):** ఉత్తరాంధ్ర అభివృద్ధి, ప్రాంతీయ సమస్యల పరిష్కారంపై నిరంతరం గళం విప్పుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ధర్మాన ప్రసాదరావును పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు శనివారం ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై వారు చర్చించారు. ప్రాంతీయ సమస్యల పరిష్కారం కోసం ధర్మాన ప్రసాదరావు చేస్తున్న కృషిని బల్ల గిరిబాబు అభినందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మారడ భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రోణంకి వెంకటరమణ, వ్యవసాయ బోర్డు మాజీ చైర్మన్ గొర్ల వేణు, వైఎస్సార్‌సీపీ నాయకులు వల్లభ వైకుంఠరావు, పి. ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ ప్రచార పాదయాత్రలను జయప్రదం చేయాలి

- సెప్టెంబర్ 1న 'చలో ఢిల్లీ'కి జిల్లా నుంచి భారీగా తరలిరావాలని పిలుపు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ విమర్శలు

**శ్రీకాకుళం, ఆగస్టు 1 (వార్త):** దేశ సమైక్యత, సమగ్రాభివృద్ధి లక్ష్యంగా సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఆగస్టు 6 నుంచి 15 వరకు నిర్వహించే ప్రచార పాదయాత్రలను విజయవంతం చేయాలని, సెప్టెంబర్ 1న నిర్వహించే 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలిరావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని క్రాంతి భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీలైన ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు, నల్లధనం వెలికితీత, మేక్ ఇన్ ఇండియా, సమగ్రాభివృద్ధి వంటి అంశాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి కులం, మతం, ప్రాంతాల పేరుతో రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తోందని విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలను పెంచుతూ వ్యవసాయ వ్యయాన్ని అధికం చేసిందని అన్నారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్మిక హక్కులను బలహీనపరిచే విధానాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వరుస పేపర్ లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, మహిళల భద్రత, సాధికారత విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అయోధ్య రామ మందిరం నిర్మాణానికి సంబంధించిన అవినీతి ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీలు, పోలవరం ప్రాజెక్టు పూర్తి, రాజధాని నిర్మాణం, కడప ఉక్కు కర్మాగారం వంటి అంశాల్లో కేంద్రం నుంచి హామీలు సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లాను ఎల్‌నినో ప్రభావిత, కరువు జిల్లాగా ప్రకటించాలని, జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని, వంశధార ఆఫ్‌షోర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని, గిరిజన సమస్యలను పరిష్కరించాలని, కార్గో ఎయిర్‌పోర్టు కోసం బలవంతపు భూసేకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 6 నుంచి 15 వరకు జరిగే ప్రచార పాదయాత్రలను, సెప్టెంబర్ 1న నిర్వహించే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. యుగంధర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్. వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546